
# బామ్మ-బాంబు

దానం ఉమాదేవి




"నా పూజ అయ్యేదాకా ఈ గది లోకి రావొద్దని ఎన్నిసార్లు చెప్పాను"

తలమీది చీరచెంగును సరిజేసుకుంటూ మనవడిని కోప్పడింది సుభద్రమ్మ.

"అసలు నీ పూజ పూర్తయ్యేది ఎప్పుడు? ఎప్పుడూ మడి తడి అంటూ ఆ గదిలోనే కాలం గడుపుతావు. ఇక లోపలకు రాకూడదు అంటే ఎట్లా"

"నిష్టగా చేసుకుంటేనే నాకు తృప్తి"

"నీనిష్ట మాకు కష్టంగా ఉంది బామ్మా! నిన్ను తగిలితే బాధపడాలి, గదిలోకే రాకూడదంటే ఎలా?" బామ్మకు సమాధానమిచ్చాడు శ్రీకాంత్.

"మాటకు మాట సమాధానమివ్వటం నేర్చావు"

గొణుక్కుంటూ హారతిస్తున్న బామ్మను చూసి నవ్వాడు శ్రీకాంత్.

"పూజ మనసుపెట్టి చెయ్యవే! ఆ తిట్లు నాకో, దేవుడికో అర్థంకావటం లేదు"

మనవడివైపు కోపంగా చూసి చెంపలేసుకుని మళ్ళీ హారతిచ్చింది సుభద్రమ్మ.

సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన సుభద్రమ్మకు ఆచారాలు-పట్టింపులు ఎక్కువే. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురూ. పెద్దకొడుకు జానకిరామయ్య దగ్గర ఉంటుంది. ఆయన స్కూలు టీచర్‌గా పనిచేస్తున్నాడు. జానకిరామయ్యకు ఒక అమ్మాయి, అబ్బాయి. అమ్మాయి డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నది. శ్రీకాంత్ పదవతరగతి పరీక్షలు రాశాడు. సెలవులవటంతో ఒకటే ఆటలు. ఆటలాడి స్నానం చేయకుండా వంటింట్లోకి అడుగుపెట్టటం సుభద్రమ్మకు నచ్చదు. రోజూ ఈ విషయంలో బామ్మా, మనవళ్ళ మధ్యగోలే. రోజూ ఏక కాలంలోనే అటు పూజ, ఇటు మనవడిని మందలించటం జరుగుతుంటుంది. శ్రీకాంత్ అల్లరివాడవటంవల్ల కావాలనే బామ్మను ఉడికిస్తుంటాడు. ఆమె మందలిస్తున్నప్పుడు ఈ తిట్లు నాకు స్వామీ, ఆ మంత్రాలు నీకు అంటూ ఉంటాడు దేవుడితో సరదాగా.

మనవడి వేళాకోళం ఎక్కువైనప్పుడు పూజ పూర్తికావించి ఆ కోపం కోడలు వకుళ మీద చూపిస్తుంటుంది సుభద్రమ్మ.

"వాడికి ఒక పద్ధతి నేర్పవే. అసలు నిన్ననాలి"

"ఇది ఇంకా బాగుంది. నేనేం చేశాను మధ్యలో. మీరు రోజూ చెబుతున్నారు. వాడు విన్నాడా! అయినావాడ్ని ఒక్కమాట అన్నా ఊరుకోరు. అదేమంటే వాడు మామయ్యగారి పోలికలతో ఉన్నాడంటారు. మీరిచ్చిన అలుసే అది" అత్తగారితో అన్నది వకుళ.

అంతలో బయటనుండి లోపలకు వచ్చాడు జానకిరామయ్య.

"ఏమిటి గొడవ"

విషయం చెప్పింది కూతురు పరిమళ.

"వాడికి చక్కగా ఉపనయనం చెయ్యరా! సంధ్యావందనం చేసుకుంటూ కాస్త ఆచారాలు వంటపట్టించుకుంటాడు" కొడుకుతో చెప్పింది సుభద్రమ్మ.

దూరం నుండే బామ్మను బెదిరిస్తున్నట్లుగా వేలు చూపించాడు శ్రీకాంత్.

"ఇన్ని పూజలు చేస్తున్నావు కదా! పనిలోపని అది కూడా నువ్వే కానియ్యి" అంటూ అక్కడినుండి వెళ్ళిపోయాడు శ్రీకాంత్.

"ఉపనయనం మాట ఎత్తితే చాలు. వినకూడని మాట విన్నట్టు వెళ్ళిపోతాడు"

"అమ్మా! ఈకాలం పిల్లలు మా కాలంలోలాగా చెప్పినవాటికల్లా తలూపరు. వకుళతో నీ పెళ్ళి అంటే, నేను బుద్ధిగా తలూపాను. నేను విన్నట్లే వాడు వినాలంటే ఎలా? కాలం మారింది. మనమూ కొన్నింటికి సర్దుకుపోవాలి. చిన్నవయసులో ఉపనయనం చేస్తేవాళ్ళకి ఏమీ తెలియదు గాబట్టి ఒప్పుకునేవాడు. చిన్నగా నచ్చచెప్పి చెయ్యాలిగానీ, అరిస్తే ఒప్పుకుంటాడా!" అన్నాడు జానకిరామయ్య.

"సరేలే! నా కాలూ-చెయ్యీ ఆడుతున్నప్పుడే అన్ని శుభకార్యాలు జరిగితే బాగుండునని నా కోరిక"

"బామ్మా! నీకేం గుండ్రాయి ఉన్నట్లున్నావు. వాడి కొడుకు ఉపనయనం కూడా చూస్తావు" అన్నది పరిమళ.

"అంతకంటే కావాల్సిందేమున్నది" అంటూ మనవరాలిని బుగ్గమీద ముద్దుపెట్టుకున్నది సుభద్రమ్మ.

ఆరోజు రాత్రి ఏడుగంటలకు జానకిరామయ్య చెల్లెలు ఫోన్ చేసింది.

"అన్నయ్యా! కావ్య పెళ్ళి దగ్గర పడుతున్నది కదా! అమ్మ దగ్గరుంటే పెద్దదిక్కుగా బాగుంటుంది. ఏ పని చేయాలన్నా అన్నీ డౌట్లే. అమ్మ దగ్గరుంటే సలహాలిస్తుంది. నాకూ టెన్షన్ తప్పుతుంది. రేపు బస్సెక్కించు. మీ బావ వచ్చి రిసీవ్ చేసుకుంటారు. మీరు మాత్రం వారం ముందన్నా రావాలి"

అదే విషయాన్ని తల్లితో చెప్పాడు జానకిరామయ్య.

"మీనాక్షి నిన్ను రమ్మంటున్నది. రేపు బయల్దేరు"

"ఎల్లుండి దశమి. ఆ రోజు వెళతాన్లే" అన్నది సుభద్రమ్మ.

మీనాక్షి అద్దంకిలో వుంటున్నది. బస్సు ఎన్ని గంటలకు ఉంటుందో కనుక్కొని వచ్చాడు శ్రీకాంత్.

"ఉదయాన్నే అద్దంకి మీదుగా వెళ్ళే బస్‌లులేవు. బస్‌లు మారి వెళ్ళాలంటే ఇబ్బందిపడతావు బామ్మా! పదకొండునుండి అయితే డైరక్ట్ బస్‌లుంటాయి"

సుభద్రమ్మ కేలండర్ తీసుకుని తాను వెళ్ళాల్సిన


రోజు వర్జ్యం, దుర్ముహూర్తం వగైరాలు ఎన్నింటి దాకా ఉన్నాయో చూసింది.

"దశమినాడు ఉదయం ఎనిమిదినుండి తొమ్మిది దాకా దుర్ముహూర్తం. తొమ్మిది నుండి పదిన్నరదాకా వర్జ్యం. పదింబావు నుండి పన్నెండు దాకా రాహుకాలం"

"నీవు మంచి ముహూర్తం చూసుకొని వెళ్ళేదాకా బస్సాగదు. వాళ్ళకు టైమింగ్స్ ముఖ్యం. ముహూర్తాలు కాదు" అన్నాడు శ్రీకాంత్.

"పదకొండు గంటల బస్సెక్కించు" అన్నది సుభద్రమ్మ.

"చాదస్తాలు వదిలిపెట్టి ఈ లోకంలోకి వస్తున్నావన్నమాట- గుడ్" అన్న శ్రీకాంత్‌ను చూసి చిన్నగా నవ్వింది సుభద్రమ్మ.



వెళ్ళాల్సిన రోజు మూడింటికే లేచి స్నానాది కాలు పూజలు వగైరా ముగించుకున్నది.

"వాడ్ని నిద్ర లేపవే వకుళా! బస్టాండ్‌కు వెళ్ళాలి"

"ఏడున్నరే కదా అత్తయ్యా"

"ఎనిమిది నుండి పన్నెండు దాకా బాగా లేదు. బస్సేమో పదకొండుకే. ఎనిమిది లోపలే ఇంటినుండి బయల్దేరితే సరి"

"మూడు గంటలపాటు బస్టాండులో కూర్చోగలవా! అన్నింటికీ మంచిచెడూ చూడాలంటే ఎలా" అన్నాడు జానకిరామయ్య.

"వచ్చీపోయే బస్సులను, జనాలను చూస్తూ కూర్చుంటాను. అదే కాలక్షేపమవుతుంది" అన్నది సుభద్రమ్మ.

తల్లి మాటలను కాదని బలవంతంగా బస్ టైముకి బయల్దేరితే చిన్న తలనొప్పి వచ్చినా చెడుసమయంలో బయల్దేరినందుకే అలా తలనొప్పివచ్చిందని తల్లి సతాయిస్తుందని జానకిరామయ్యకి తెలుసు. పైగా క్షేమంగా ఇల్లు చేరేదాకా ఆవిడకీ టెన్షనే.

విసుక్కుంటూనే నిద్రలేచి రెడీ అయ్యాడు శ్రీకాంత్.

"నీతోపాటు మూడుగంటలు నేను కూడా బస్టాండ్‌లో ఉండాలా- నిన్ను దించేసి వస్తా"

"ఇక్కడికొచ్చి చెయ్యాల్సిన ఘనకార్యాలేమీ లేవుగానీ బామ్మను బస్సెక్కించేదాకా అక్కడే ఉండు"

తండ్రికి ఎదురుచెప్పలేక అయిష్టంగా సరే అన్నాడు శ్రీకాంత్.

"అత్తయ్యగారూ టిఫిన్" అంటూ చపాతీల ప్లేట్ అత్తయ్యగారికి అందించబోయింది వకుళ.

"టిఫిన్ చేసేటప్పటికి ఎనిమిది దాటుతుంది. దుర్ముహూర్తం వస్తుంది"

"మీరు అద్దంకి చేరుకునేటప్పటికి

మూడోనాలుగో అవుతుంది. హోటల్లోవి అసలు ముట్టుకోరాయె! టిఫిన్ కూడా తినకపోతే ఎలా?"

"ఒకరోజుకి ఏం కాదులే! బయల్దేరరా అబ్బాయ్" అంటూ మనవడిని తొందరపెట్టింది సుభద్రమ్మ.

అత్తగారి తత్త్వం తెలిసిన వకుళ ఒక బాక్స్‌లో నాలుగు చపాతీలు పెట్టి ఇచ్చింది. బయట అందరి ఎదుట ఎలా తింటాను వద్దని తిరస్కరించింది సుభద్రమ్మ. అయినా వకుళ బలవంతంగా బుట్టలో పెట్టిందా బాక్స్.

సుభద్రమ్మను తీసుకొని ఎనిమిదిలోపే ఇంటి నుండి బయలుదేరాడు శ్రీకాంత్. బస్టాండ్ ఓ మోస్తరు రష్‌గా ఉంది. ఒక ఖాళీ బెంచీ చూసి బామ్మను కూర్చోపెట్టాడు. కాసేపు వచ్చీపోయే బస్‌లు చూస్తూ కూర్చుంది సుభద్రమ్మ. మనవడికి లగేజీ అప్పగించి కాసేపు బస్టాండ్ నాలుగు మూలలు తిరిగింది.

తొమ్మిది దాటింది. శ్రీకాంత్ చపాతీలు తినమని బ్రతిమిలాడినా ఇంతమందిలో తిననని భీష్మించుకున్నది సుభద్రమ్మ.

"బామ్మా! నువ్వు మారాలి. లేకుంటే అత్తావాళ్ళింటికి వెళ్ళే బదులు హాస్పిటల్‌కి వెళ్ళాల్సి వస్తుంది"

అయినా సుభద్రమ్మ విన్పించుకోలేదు.

బామ్మచేత ఎలా టిఫిన్ తిన్పించాలా అని ఆలోచిస్తున్న శ్రీకాంత్ దృష్టి బస్టాండ్‌లో ప్లాట్‌ఫారం దగ్గర కాకుండా ఒక పక్కగా ఆగి ఉన్న బస్‌మీద పడింది. వెళ్ళి చూసి వచ్చాడు. బయల్దేరటానికి చాలా టైం ఉన్న బస్‌లను కాసేపు పక్కన ఉంచుతారు.

"బామ్మా! నీవు టిఫిన్ చేయటానికి మంచి ప్లేస్ ఉంది రా!" అన్నాడు.

ఆ బస్‌లో ఎవరూ వెంటనే ఎక్కరు కాబట్టి హాయిగా అందులో టిఫిన్ చేయొచ్చని చెప్పి సుభద్రమ్మను ఆ బస్‌లోకి తీస్కెళ్ళాడు శ్రీకాంత్.

ఆ ఆలోచన సుభద్రమ్మకు కూడా నచ్చటంతో సరేనని బస్ ఎక్కింది.

"ఈ బాక్స్ ఇంటికి తీస్కెళ్ళు" అన్నది ఖాళీ చేసిన టిఫిన్ బాక్స్‌ను మనవడికి అందివ్వబోతూ.

"కవర్లో పెట్టి నీ దగ్గరే ఉంచు. వెళ్ళేటప్పుడు తీస్కెళ్తా" అన్నాడు శ్రీకాంత్.

కాసేపు బస్‌లోనే కూర్చుని మనవడితో కబుర్లు చెప్పి క్రిందికి దిగింది.

అప్పుడే తల్లిని బస్సెక్కిస్తున్న ఫ్రెండ్ కృష్ణ, శ్రీకాంత్ కంటపడ్డాడు.

"బామ్మా! నీవు ఇక్కడే కూర్చో! నేను మా ఫ్రెండ్‌తో మాట్లాడి వస్తా" బామ్మను ఒక బెంచీమీద కూర్చోపెట్టి కృష్ణదగ్గరికి వెళ్ళి కబుర్లలో పడ్డాడు శ్రీకాంత్.

సుభద్రమ్మ పక్కనున్న మహిళా ప్రయాణీకులతో కబుర్లలో పడింది.

"ఏ ఊరు వెళ్ళాలి? ఎవరింటికి వెళ్ళాలి? ఏ పనిమీద? ఎవరెవరు వెళ్తున్నారు?" ప్రశ్నమీద ప్రశ్న వేస్తూనే ఉన్నది సుభద్రమ్మ.

అంతలోనే ఏదో కలకలం. అందరూ కంగారుగా పరుగులు పెడుతున్నారు. ఎవరో ఫోన్లు చేస్తున్నారు. కొంతమంది దూరంగా నిలబడి ఏదో మాట్లాడుకుంటున్నారు.

బస్‌లలో ఎక్కి ఉన్న ప్రయాణీకులందరూ తమ లగేజీ మోసుకుంటూ ఒకర్నొకరు తోసుకుంటూ బస్ దిగి ఉరుకులు పెట్టుకుంటూ బస్టాండ్ దాటి వెళ్ళిపోతున్నారు.

సుభద్రమ్మకేమి జరిగిందో అర్థం కాలేదు. మనవడికోసం చుట్టూ చూసింది. కానీ కన్పించలేదు. ఇంతలో ఒక పోలీస్ జీప్ వచ్చింది.

"బస్టాండులో ఎవరూ ఉండొద్దు. అందరూ ఇవతలకు వచ్చేయ్యండి"

మైక్‌లో ఎనౌన్స్ చేశాడో కానిస్టేబుల్.

సుభద్రమ్మ తన లగేజి తీసుకుని బస్టాండ్ బయటకు వచ్చింది.

"ఏమైంది" చుట్టూ గుమిగూడిన వాళ్ళనడిగింది.

"బస్టాండులో బాంబ్ ఉందట"

"బాంబా! ఎవరుపెట్టారు" అంటూ చుట్టూ చూసింది. శ్రీకాంత్ ఎక్కడికి వెళ్ళాడోనని ఆమెలో కంగారు.

కాసేపటికి బాంబ్‌స్క్వాడ్ వచ్చింది. పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, సుభద్రమ్మ ఎక్కిదిగిన బస్ దగ్గరికి వెళ్ళారు.

ఇందాక తానెక్కిన బస్‌లోనే బాంబ్ ఉందన్న మాట. తాను అందులో ఉన్నప్పుడే పేలితే! సుభద్రమ్మ గుండె ఝల్లుమన్నది.

రోజూ టీవీలో చూస్తూనే ఉన్నది బస్టాండ్లలో, రైల్వేస్టేషన్‌లో బాంబ్‌లు పెట్టారన్న వార్తలు. అమాయకులను చంపితే వాళ్ళకొచ్చే లాభమేమిటి! అనుకునేదికానీ ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నది. సుభద్రమ్మ ఒళ్ళంతా భయంతో కంపిస్తున్నది.

'బాంబ్ పెట్టినవాళ్ళు ఇక్కడే దూరంగా ఉండి,



# కంగనాకి పాపులారిటీ

కంగనా రనౌత్ ఈమధ్య వార్తల్లో అంతగా కనిపించడం లేదు. అయితే తాజాగా ఆమె నటించడానికి అంగీకరించిన ఓ సినిమా 'వన్ అండ్ ఓన్లీ'తో పాపులారిటీ వస్తోంది క్రమంగా. కారణం ఏంటంటే- ఈ సినిమాలో హీరోగా నటిస్తున్న కుర్రాడు మరెవరో కాదు, బిహార్‌కి చెందిన ప్రముఖ రాజకీయనాయకుడు రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్. రాజకీయాల్లో కొంతకాలంగా కాస్త వెనకబడిన పాశ్వాన్ తన కొడుకుని సినిమా హీరోని చేద్దామని నిర్ణయించుకున్నాడట. చిరాగ్ నటిస్తున్న తొలిచిత్రంలో హీరోయిన్‌గా కంగనా నటించడంతో ఆమె అందరి దృష్టిలోకి వస్తోందిప్పుడు.

పేలిందీ లేనిది చూస్తారా! కొన్ని రిమోట్‌తో పేల్చేస్తారని విన్నది. బాంబు అమర్చినవాళ్ళు ప్రయాణీకులలో కలిసిపోయి ఇక్కడే ఉండి ఉంటారు' అనుకుంటూ చుట్టూ చూసింది సుభద్రమ్మ.

నల్లగా ఉండి జులపాల జుట్టుతో గళ్ళచొక్కా వేసుకుని చూడటానికి మొరటుగా వున్న ఒక వ్యక్తి మీద ఆమె దృష్టిపడింది. సెల్‌లో ఎవరితోనో మాట్లాడుతూ మధ్య మధ్యలో దిక్కులు చూస్తున్నాడు వెధవ! వీడే బాంబ్‌పెట్టి ఉంటాడు.

"టిఫిన్ బాక్స్ బాంబట" ఎవరో అరిచారు.

పోలీసు జాగిలాలు బస్‌ఎక్కిదిగి ప్రయాణికుల మధ్యకు వచ్చింది.

తన అనుమానం నిజమే. ఇప్పుడీ పోలీసు కుక్క వాడినే పట్టుకుంటుంది. అనుకుంటూ ఊపిరి బిగబట్టి చూస్తున్నది సుభద్రమ్మ.

ఈలోగా బాంబ్ స్క్వాడ్ బస్‌నుండి బాంబ్ ఉన్న టిఫిన్ బాక్స్‌ను అతి జాగ్రత్తగా క్రిందికి తెచ్చి బస్టాండు ఆవరణలో ఒక మూలన పెట్టారు. పైకి వైర్లు కనిపించటం లేదు. టైం బాంబేమో! ఎన్ని గంటలకు సెట్‌చేశారో, బాక్స్ మూత తెరిస్తే పేలిపోవచ్చు. దానిని ఎలా నిర్వీర్యం చేయాలా అని చర్చించుకోసాగారు బాంబ్‌స్క్వాడ్.

ఒక్కో ప్రయాణీకుడిని వాసన చూస్తూ వచ్చిన జాగిలం, సుభద్రమ్మ దగ్గర కదలకుండా రెండుకాళ్ళ మీద నిలబడి ఆమె మీదకు ఎగబడసాగింది. సుభద్రమ్మలో ప్రాణభయం. తననెక్కడ ఆ కుక్క చీల్చేస్తుందో!

ఒక కానిస్టేబుల్ కుక్కను పక్కకు తీసుకెళ్ళగా పోలీసులు సుభద్రమ్మను అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు నోట మాట రావటం లేదు. ఆ గళ్ళచొక్కా వాడ్ని వదిలిపెట్టి ఆ కుక్క తనమీదకొచ్చిందెందుకు?

"అక్కడ బాంబెందుకు పెట్టావు! నీ వెనకెవరున్నారు?" పోలీసుల ప్రశ్న.

తీవ్రవాదులు ఇన్నాళ్ళూ యువకులను, బాలలను ఉపయోగించుకున్నారు. వాళ్ళు పోలీసులకు చిక్కుతుండటంతో వ్యూహం మార్చారన్నమాట. ఇలాంటి ముసలమ్మలైతే ఎవరికీ అనుమానం రాదు. వీళ్ళకన్నా పాపభీతి ఉండొద్దు! అసలు ఈమె నిజంగా ముసల్దేనో లేక మేకప్పో!

పోలీసులలో కొంతమంది తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు.

"ఈ ముసల్ది బస్టాండ్‌కొచ్చి చాలాసేపైంది. ఎన్ని బస్‌లొచ్చినా ఎక్కదు. ఇందాక ఆ బస్‌లోకెక్కి కాసేపుండి దిగింది. బాంబ్ అమర్చి దిగినట్లున్నది. ఈమెతోపాటు ఓ కుర్రాడు కూడా ఉండాలి. బాంబ్ అమర్చగానే వాడెళ్ళిపోయాడు. బాంబ్‌పేలటం చూసిపోవాలని ఈ ముసల్ది ఉన్నట్లున్నది"

బస్టాండ్‌లో శనక్కాయలు అమ్ముకునే రామయ్య పోలీసులతో చెప్పాడు.

"నేను టిఫిన్ చేయటానికి బస్ ఎక్కాను. నేనెక్కాల్సిన బస్ పదకొండు కొస్తుంది" గొంతు పెగల్చుకొని చెప్పింది సుభద్రమ్మ.

"పదకొండుకు బస్ వస్తుంటే ఎనిమిదికే ఎందుకొచ్చావు" గద్దించాడు ఎస్సై. విషయం చెప్పింది.

"నీ మాటలు నమ్మశక్యంగా లేవు. నీతో వచ్చిన కుర్రాడేడీ"

ఇంతలో "బామ్మా ఎక్కడున్నావు" అంటూ శ్రీకాంత్ వచ్చాడు.

"ఎవరో బాంబ్ పెట్టారట! త్వరగా ఇంటికెళ్దాం పద" అన్నాడు సుభద్రమ్మ చెయ్యి పట్టుకొని.

"వేషాలెయ్యకుండా నోర్మూసుకొని ఉండండి. మీ వెనకెవరున్నారు? ఆచూకీ చెబితే మీకు శిక్ష తగ్గుతుంది" అన్న ఎస్సై వైపు అయోమయంగా చూశాడు శ్రీకాంత్.

తాము బస్సెక్కి దిగటంవల్ల ఆ బస్‌లోనే బాంబ్ ఉండటంతో కుక్క తన మీదికి ఎగబడిన సంగతి మనవడికి చెప్పింది సుభద్రమ్మ.

మీడియా ప్రతినిధులు వచ్చారు. పోలీసులు ఇంటరాగేట్ చేస్తున్న సుభద్రమ్మ, శ్రీకాంత్‌లను కవర్ చేయసాగారు. కొంతమంది విలేకర్లు ప్రయాణీల అనుభూతులెలా ఉన్నాయో అడుగుతున్నారు.

తండ్రికి విషయమంతా చెప్పి అక్కడికి పిలిపించుకోవాలని ఫోన్ చేయటానికి సెల్ బయటకు తీశాడు శ్రీకాంత్. వెంటనే పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు.

"మా అనుమతి లేకుండా మీరు ఏం చెయ్యటానికి వీల్లేదు" అన్నాడు ఎస్సై.

"సార్! మేము చెప్పేది నిజం. మా బామ్మ టిఫిన్ చేయటం కోసమే బస్సెక్కాం. ఆవిడకి నమ్మకాలెక్కువ. అందుకోసమే ముందుగా బస్టాండుకొచ్చాము. కావాలంటే బామ్మ టిఫిన్ చేసిన ఖాళీ టిఫిన్ బాక్స్ ఉంది చూడండి" అంటూ బాక్స్ కోసం లగేజి అంతా వెతికాడు శ్రీకాంత్. లేదు.

"నీవు ఇంటికి తీస్కెళతావని విడిగా కవర్లో పెట్టి ఉంచాను. బస్‌లోనే మర్చిపోయామేమో!" అన్నది సుభద్రమ్మ.


ఏం జరిగుంటుందో శ్రీకాంత్‌కు అర్థమైంది. రయ్యిన ముందుకురికాడు. పారిపోతున్నాడని భావించి పోలీసులు వెంటపడ్డారు. శ్రీకాంత్ టిఫిన్

## దటీజ్ ఐశ్వర్య

వయసు పెరుగుతున్న కొద్దీ ఐశ్వర్యారాయ్ డిమాండను కూడా పెంచుకుంటోందనడానికి తాజా ఉదాహరణ- ఓ అంతర్జాతీయ కంపెనీకి యాడ్స్ చేయడమే. అది కూడా ఎలా అనుకుంటున్నారు? 'టైటానిక్' భామ కేట్ విన్‌స్లెట్‌తో కలిసి యాడ్స్ చేయబోతోందిట ఐష్. ఆ కంపెనీ ఈ యాడ్స్ కోసం బాలీవుడ్ భామల్లో కొందరిని పరిశీలించిందిట. వాళ్లలో సోనమ్ కపూర్ లాంటి కుర్రతారల గురించి ఆలోచించి చివరకి ఐశ్వర్యారాయే బెస్ట్ అని తీర్మానించుకున్నారట.



బాక్స్ ఉన్నచోటుకొచ్చి ఆగాడు.




ఒక నల్లకవరులో ఉందా బాక్స్! చుట్టూ బాంబ్‌స్క్వాడ్ ఉన్నారు. ఒక్క సారిగా దానిని సమీపించి ఆ కవర్ చేతిలోకి తీసుకున్నాడు శ్రీకాంత్.

"ఆత్మాహుతి దళానికి చెందిన వాడై ఉంటాడు. పట్టుపడేకన్నా తాము పేలిపోవటానికే సిద్ధపడతారు వాళ్ళు. అందరూ దూరం జరగండి" అరిచాడో పోలీస్.

అందరూ దూరంగా జరిగి కళ్ళప్పగించి చూడసాగారు. శ్రీకాంత్ కవర్‌లో నుండి బాక్స్ బయటకు తీశాడు. బాక్స్ మూత తీస్తుండగా అందరూ ఊపిరి బిగపట్టారు. తమ కళ్ళముందే ఒక విస్ఫోటనం జరగనుంది.

శ్రీకాంత్ బాక్స్‌మూత తీశాడు. అందరి కళ్ళలో ఆశ్చర్యం. ఏమీ కాలేదు. బాంబ్ సెట్ చేయలేదా! ముడిపదార్థాలేనా! మళ్ళీ పోలీసులు చిన్నగా శ్రీకాంత్‌ను సమీపించి ఒక అడుగుదూరంలో నిలబడి బాక్స్‌లోకి తొంగిచూశారు. అందులో కొన్ని చపాతీ ముక్కలు కూర ముక్కలు ఉన్నాయి.

"మా బామ్మ బస్‌లో కూర్చుని చపాతీలు తిని బాక్స్‌ని సీటుక్రిందనే మర్చిపోయింది. మా మాట నమ్మకుండా బామ్మ-బాంబ్ అంటూ హడావుడి చేశారు" అన్నాడు శ్రీకాంత్ యస్సైతో.

"నా వయసును కూడా చూడకుండా ఎంత నిందవేశారు నామీద. నన్ను చూస్తే అంద నీచానికి పాల్పడేదానిలా కన్పిస్తున్నానా! కనీసం చెప్పేది కూడా వినరు. ఎంత టెన్షన్ అనుభవించానో ఆ భగవంతుడికి తెలుసు"

కళ్ళొత్తుకుంటూ అన్నది సుభద్రమ్మ.

ఏం జరిగుంటుందో యస్సైకి అర్థమైంది. వీళ్ళు బాక్స్ బస్ సీటు కిందపెట్టి మర్చిపోయారు. తరువాత ఎవరో చూసి బాంబ్ పెట్టి ఉంటారని భ్రమపడి పోలీసులకు ఫోన్ చేశారు. వాళ్ళదీ తప్పులేదు. ఈమధ్యకాలంలో ఇలాంటివి చాలా జరిగాయి మరి. అనుమానాస్పద వ్యక్తులుగానీ వస్తువులుగానీ కన్పిస్తే తమకు సమాచారం ఇవ్వమని తామే ప్రకటన ఇచ్చాము. కీడెంచి మేలెంచటం మంచిది కదా! అదే ఈ బామ్మను ఇన్ని ఇబ్బందులకు గురిచేసింది.

"సారీ బామ్మగారూ" అన్నాడు ఎస్సై.

ఇంతలో అద్దంకి బస్ వచ్చింది. బ్యాగ్ పట్టుకొని బస్ ఎక్కబోతున్న మనవడిని ఆపింది సుభద్రమ్మ.

"ఇంత టెన్షననుభవించి, ప్రయాణం చేయాలంటే అలసటగా ఉంది. రేపువెళ్తానులే"

"ఇంత గొడవకు కారణం నీ చాదస్తమే బామ్మా! ముందు ఇంటికి నడు" అన్నాడు శ్రీకాంత్ వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ.

పోలీసులు వెళ్ళిపోయారు. విషయం అర్థమైన ప్రయాణీలు తమను చూసి నవ్వుతుండటంతో తలవంచుకొని సుభద్రమ్మ చేయిపట్టుకొని బయటకు నడిచాడు శ్రీకాంత్.

"ఏమిటి! బస్సులేవా! బందా" అడిగాడు జానకిరామయ్య ఇంట్లోకి అడుగుపెడుతున్న తల్లిని చూసి.

జరిగిందంతా చెప్పి పోలీసులను శాపనార్థాలు పెట్టింది సుభద్రమ్మ.

"ఇందులో వాళ్ళ తప్పేముంది. వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేశారు. దుర్ముహూర్తం చూసుకొనే బయలుదేరావుగా! ఇలా ఎందుకు జరిగినట్లో" వెటకారంగా అన్నాడు శ్రీకాంత్ బామ్మమీద పీకల్దాకా ఉన్న కోపంతో.


"సమయానికి బయల్దేరితే ఈ గొడవ ఉండేది కాదు కదా" అన్నది పరిమళ.

"కాస్త నీ చాదస్తం తగ్గించుకోమ్మా అన్నిటికి ముహూర్తాలు అంటే ఇలాగే ఉంటుంది" తల్లికి నచ్చచెబుతున్న ధోరణిలో అన్నాడు జానకిరామయ్య.

ఈ సంఘటనతో అత్తగారిలో మార్పు వస్తుందని భావించింది వకుళ.

"దుర్ముహూర్తం వర్జాలు లేకుండా బయలుదేరాను కాబట్టే క్షేమంగా ఇల్లు చేరాను. పైగా పోలీసులు 'సారీ' కూడా చెప్పారు. అదే దుర్ముహూర్తంలో బయలుదేరితే.." అంటూ గుండెలమీద చెయ్యేసుకుంది సుభద్రమ్మ.

"ఆ!..." అంటూ నోళ్ళు తెరిచారందరూ.



## కమల్ డైరెక్షన్..!

అయిదేళ్ళ వయసు నుంచీ సినిమాల్లో నటిస్తూ నటనలో '50' సంవత్సరాలు పూర్తి చేసుకున్న 55 ఏళ్ల కమల్‌హాసన్‌కి ఇటీవల గొప్ప గౌరవం లభించింది. ఇటలీలో ఓ సంస్థ వారు అతని సినిమాలు మూడు రోజుల పాటు ప్రత్యేకంగా ప్రదర్శించి ఆ కార్యక్రమానికి అతన్ని అతిథిగా ఆహ్వానించి గౌరవించారు. గతంలో 'హే రామ్' లాంటి ఒకటి రెండు సినిమాలను డైరెక్ట్ చేసిన కమల్‌హాసన్ త్వరలో మరికొన్ని సినిమాలను డైరెక్ట్ చేయాలనుకుంటున్నట్టు ఈ సందర్భంగా చెప్పాడు. నటుడిగా అద్భుతమైన సక్సెస్‌ని సాధించిన కమల్‌కి దర్శకుడిగా ఇంకా హిట్ ఊరిస్తోంది.